ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు


జిల్లా వార్తలు 5

సోమవారం 26 ఆగస్టు 2024



నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 25: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం రద్దు చేశామని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో కార్యక్రమం నిర్వహించడం లేదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు. సెప్టెంబరు 2వ తేదీన యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.


స్టాప్‌లాగ్ ఏర్పాటు తరువాత గేట్లు మూసి వేసిన తుంగభద్ర డ్యాం

తుంగభద్రమేనా..!?

- టీబీకి చేరిన 86.273 టీఎంసీల వరద
- స్టాప్‌లాగ్ ఏర్పాటు తరువాత 14.27 టీఎంసీల చేరిక
- మిగిలిన క్రస్ట్‌గేట్లపై అధ్యయనానికి నిపుణుల కమిటీ
- నేడు బెంగళూరులో టీబీపీ బోర్డు సమావేశం

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):

తుంగభద్ర డ్యాం గేట్లు ఎంతవరకు భద్రంగా ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల 19వ నంబరు గేటు కొట్టుకొని పోవడంతో మిగతా గేట్ల పరిస్థితి ఏంటన్న సందేహాలు కలుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ నెల 12న జరిగిన తంగభద్ర బోర్డు అత్యవసర సమావేశంలో మిగిలిన 32 క్రస్ట్‌గేట్లు భద్రతపై మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణులతో ప్రత్యేక కమిటీ వేసి అధ్యయనం చేయాలని తీర్మానం చేశారు. ఈ మేరకు సోమవారం బెంగళూరులో జరగనున్న సమావేశంలో క్రస్ట్‌గేట్ల నిర్వహణపై చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

86.273 టీఎంసీలకు చేరిన వరద

డ్యాంలో నీటి నిల్వ 86.273 టీఎంసీలకు చేరింది. స్టాప్‌లాగ్ ఎలిమెంట్ విజయవంతంగా అమర్చిన తరువాత 14.27 టీఎంసీలు అదనంగా నిల్వ చేశారు. రోజు సగటున పది వేల క్యూసెక్కుల (0.85 టీఎంసీలు) చొప్పున ఈ ఎనిమిది రోజుల్లో సుమారు 6.5 టీఎంసీలు ఏపీ, కర్ణాటక అవసరాల కోసం వివిధ కాలువలకు విడుదల చేశారు. అంటే.. 21.07 టీఎంసీలకు పైగానే అదనంగా ఆదా చేయగలిగామని ఇంజనీర్లు అంటున్నారు. డ్యాం పూర్తి స్థాయి సామర్థ్యం 10.5.788 టీఎంసీలకు గానూ.. 19.515 టీఎంసీలు తక్కువ ఉంది. ఆదివారం ఉదయం 8 గంగలకు నీటి లెక్కలు తీసే సమయానికి డ్యాంలో నీటి నిల్వ 86.273 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 23,725 క్యూసెక్కులు (2.049 టీఎంసీలు) వరద వచ్చి చేరుతోంది. డ్యాం ఎగువ ప్రాంతం పడమటి కనుల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఈ ఏడాది సాగు, తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కవచ్చని తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు (టీబీపీ) ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ సాగు నీటి కష్టాలు తీరుతాయని రాయలసీమ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఈ నెల 10న కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ నంబరు గేటు (ఫైల్)

సాగు ఆశలకు జీవం

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి తుంగభద్ర జలాశయం. మూడు రాష్ట్రాల్లో సుమారు 12.5 లక్షల ఎకరాలకు సాగు నీరు, కోటి మందికిపైగా ప్రజల దాహం తీరుస్తోంది. అలాంటి తుంగభద్ర డ్యామ్‌కు భారీగా వరద చేరడంతో ఏడాది ఖరీఫ్, రబీ సాగుకు ఢోకా ఉండదని రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాలకు చెందిన తుంగభద్ర కుడి దిగువ కాలువ (ఎల్లెల్సీ), ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆయకట్టు రైతులు భావించారు. సాగుకు సన్నాహాలు మొదలు పెట్టారు. జిల్లాలో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1.57 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగు నీరు ఇస్తామని ఐఏబీలో తీర్మానం చేశారు. అనంతపురం, కడప జిల్లాల్లో హెచ్చెల్సీ కింద 1.90 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. రైతులు వరి నాట్లలో బీజీగా ఉన్న సమయంలో ఈ నెల 10న తుంగభద్ర డ్యాం గేట్లు దించుతుండగా చైన్‌లింక్ తెగిపోయి 19వ నంబరు గేటు కొట్టుకుపోయింది. ఈ కష్ట సమయంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు క్రస్ట్‌గేట్ల నిపుణుడు ఎన్.కన్నయ్య నాయుడు రంగంలోకి దిగారు. 17వ తేదీ సాయంత్రం లోగా ఐదు స్టాప్‌లాగ్ ఎలిమెంట్ సెగ్మెంట్లు విజయవంతంగా ఏర్పాటు చేయించగలిగారు. ఆ సమయంలో డ్యాంలో 72 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే.. క్రస్ట్ లెవల్‌లో ఉండే 43 టీఎంసీలు పోగా 29 టీఎంసీలు కాపాడారు. ఆ తరువాత 33 గేట్లు క్లోజ్ చేసి డ్యాం చేరుతున్న వరదను ఆపేశారు.


నీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

ఆ క్రస్ట్‌గేట్లు భద్రమేనా..?

తుంగభద్ర జలాశయం నిర్మాణం పూర్తి చేసి 70 ఏళ్లు కావస్తుంది. డ్యాం క్రస్ట్‌గేట్ల జీవిత కాలం 45 ఏళ్లేనని క్రస్ట్‌గేట్ల నిపుణుడు ఎన్. కన్నయ్యనాయుడు స్పష్టం చేస్తున్నారు. రెండేళ్ల క్రితమే డ్యాం గేట్లు పరిశీలించి పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుకు నివేదిక ఇస్తే పక్కన పెట్టారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. 19వ గేటు కొట్టుకుపోయిన ఘటన నేపథ్యంతో ఈ నెల 12న జరిగిన తుంగభద్ర బోర్డు అత్యవసర సమావేశంలో మిగిలిన 32 క్రస్ట్‌గేట్లు భద్రతపై మెకానికల్ ఇంజనీరింగ్ నిపుణులతో ప్రత్యేక కమిటీ వేసి అధ్యయనం చేయాలని తీర్మానం చేశారు. సోమవారం బెంగళూరులో జరిగే సమావేశంలో నిపుణుల కమిటీ ఏర్పాటుపై ప్రత్యేకంగా చర్చించాలని సీమ నిపుణులు కోరుతున్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్

- నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి
- ఉమ్మడి జిల్లాలోని కృష్ణమందిరాల్లో పూజలు
- వివిధ సంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 25: శ్రీకృష్ణ భగవానుడి జన్మదిన వేడుక శ్రీకృష్ణ జన్మాష్టమిని సోమవారం ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టడం, శ్రీకృష్ణ, గోపిక, రాధ వేషధారణ పోటీలు ఏర్పాటు చేశారు. కర్నూలు నగరంలో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని శ్రీకృష్ణ మందిరంలో, కిడ్స్ వరల్డ్ ఎదురుగా ఉన్న ఇస్కాన్ ధ్యాన కేంద్రంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వివిధ పాఠశాలల్లో, మాతృమండలి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నారు.



శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం, ఆగస్టు 25: శ్రీశైలం మహా క్షేత్రానికి శ్రావణ మాసం ఆదివారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆదివారం వేకువ జాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్టనందు స్వామివారికి తలనీలాలు సమర్పించి, పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు. భక్తులతో క్షేత్ర ప్రధాన వీధులు రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్న దాన భవనంలో అన్నప్రసాద వితరణను చేశారు. క్షేత్ర పరిధిలోని సత్ర సముదాయాలు కూడా రద్దీగా కనిపించాయి. లోక కల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వర స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు సమర్పించారు.


క్యూలో వేచిఉన్న భక్తులు



పైరు పరవశం..!

పైరు పరవళ్లు తొక్కుతోంది. ఎటు చూసినా పచ్చదనమే కనిపిస్తోంది. పచ్చని పంట పొలాలు, వాటి గట్ల వెంట ఉన్న కొబ్బరి చెట్లు కోనసీమను తలపిస్తున్నాయి. కర్నూలు- సుంకేసుల రోడ్డు వెంట పచ్చ తివాచీ పరిచినట్టుగా కనిపించే సుందర దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. ఇటుగా వెళ్లే ప్రతి ఒక్కరూ అన్నదాత శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇప్పటికే సాగైన వరి పొలాలు, ఇప్పటికీ నాట్లు వేసుకుంటున్న దృశ్యాలు, పాటలతో అలుపూసొలుపు లేకుండా నారుమళ్లలో పని చేసే కూలీలు, ట్రాక్టర్లతో పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు వెరసి సుంకేసుల రోడ్డులోని పలు గ్రామాల్లో సాగు సందడి కనిపిస్తోంది.

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కర్నూలు





మిర్చి ధర ఢమాల్

- కేజీ రూ.6కు పడిపోయిన ధర
- ఆందోళనలో అన్నదాతలు

మద్దికెర, ఆగస్టు 25: నిన్న మొన్నటి దాకా కిలో రూ.50 నుంచి రూ.100 దాకా పలికిన మిర్చి ధర ఒక్కసారిగా ఢమాల్ అంది. మద్దికెర మండలంలో కిలో రూ.6కు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మొత్తం 11 గ్రామాల్లో వ్యవసాయ బోర్లు, బావుల కింద 400 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. దిగుబడి బాగానే రావడంతో కష్టాల నుంచి గట్టెక్కవచ్చని రైతులు ఆనందపడ్డారు. అయితే తీరా పంట చేతికొచ్చేసరికి కేజీ మిర్చి రూ.6కు మించి పలకకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అమ్ముకోవడానికి మార్కెట్ ఏదీ..?

మద్దికెర మండలంలో ఖరీఫ్‌లో 7,500 హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులు అప్పులు చేసి 400 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఈ ప్రాంతాల్లో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో హైదరాబాదు, బెంగళూరు ప్రాంతాలకు పంటలను తరలిస్తారు. అయితే అక్కడ 20 కేజీల మిర్చి బస్తా రూ.60 కూడా పలకలేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.లక్ష మేర ఖర్చు పెట్టామని, 50 సంచుల దిగుబడి వచ్చిందని చెబుతున్నారు. మొన్నటి వరకు కిలో రూ.80 నడిచినా పచ్చి మిర్చి ఉన్న ఫళంగా రూ.6కు పడిపోయిందని, ఈ ప్రాంతాల్లో మార్కెట్ సదుపాయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.



కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు



నాకున్న మూడెకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్‌కు తరలిస్తే కూలీలు, రవాణ చార్జీలు, సుంకాలు అన్ని తీసివేస్తే రూ.1500 చేతి నుంచి పెట్టుకున్నా.

-రామాంజనేయులు, మద్దికెర

హైదరాబాద్‌లో అమ్ముకున్నా..



మద్దికెర పరిసర ప్రాతాల్లో మార్కెట్ సదుపాయం లేకపోవడంతో మిర్చి పంటను హైదరాబాదు మార్కెట్‌కు తరలించాను. కిలో రూ.6 పలికింది. దీంతో పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రామాంజులు, మద్దికెర

మార్కెట్ సదుపాయం కల్పించాలి



మండలంలో వ్యవసాయ బోర్లు, బావులు, హంద్రీకాలువ కింద రైతులు వందలాది ఎకరాల్లో కూరగాయలు, ఆకూకూరల పంటలు సాగు చేస్తారు. మార్కెట్ పాదుపాయం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రాంతంలో మార్కెట్ సదుపాయాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది.

- మహేశ్వరరెడ్డి, ఏవో

కోర్సుల ఎత్తివేతకు ఉత్తర్వులు
అంగీకరించని తల్లిదండ్రులు

ఆలూరు, ఆగస్టు 25 : ఆలూరు మండలంలోని డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లు ఎత్తివేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. అయితే కోర్సుల ఎత్తివేతను వారు అంగీకరించలేదు. ఆ రెండు గ్రూప్‌లు తీసుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని, ఎత్తివేసి సైన్స్ గ్రూప్‌లను ప్రవేశపెడితే అడ్మిషన్లు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. అయితే ప్రిన్సిపాల్ ప్రచారం చేయకపోవడం వల్ల విద్యార్థులకు సమాచారం తెలియక చేరడం లేదని వచ్చే ఏడాది వంద శాతం పిల్లలు చేరుతారని జిల్లా అధికారికి పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ సునీల్, వైస్ ఛైర్మన్ చంద్ర మోహన్ చెబుతున్నారు. ఉన్న గ్రూప్‌లను తొలగించకుండా సైన్స్ గ్రూప్‌లను కూడా ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ శ్రీదేవి స్పందిస్తూ ఉన్నత అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి
ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ



మాట్లాడుతున్న ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ

ఆలూరు, ఆగస్టు 25 : అంధులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి హేమ అన్నా. ఆదివారం ఆలూరు పట్టణంలోని బ్రెయిలీ భగవద్గీత ఆలయం వద్ద ఉపాధ్యాయుడు బూర్ల లక్ష్మన్న అంధుల కోసం తెలుగులో తర్జుమా చేసి అచ్చు వేయించిన బ్రెయిలీ భగవద్గీత పుస్తకాన్ని, శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ జీవిత చరిత్రను పుస్తకాలను ఆమె ఆవిష్కరించారు. అంధుల కోసం శ్రమించి పుస్తకాలను అచ్చి వేయించిన బూర్ల లక్ష్మన్నను జడ్జి అభినందించారు. అనంతరం కృష్ణుడి జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరచిన మోడల్ స్కూల్ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రంగమ్మ, ఉపాధ్యాయులు సద్గురు, మహాదేవమ్మ, న్యాయవాది వాయుజీవోత్తం రావ్, రిటైర్డ్ ఉద్యోగులు వీరాస్వామి, వెంకటేశ్వరులు పాల్గొన్నారు

ముగిసిన కన్నడిగుల 9వ మహా మేళా
పాల్గొన్న వివిధ జిల్లాల ప్రతినిధులు



మాట్లాడుతున్న పీఠాధిపతులు

ఆదోని టౌన్, ఆగస్టు 25 : ఆదోని పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న అఖిల భారత రాష్ట్ర కన్నడిగుల 9వ మహా మేళ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, గోవా, కేరళ రాష్ట్రాలలోని వివిధ జిల్లాల నుంచి కన్నడిగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నరగుందలోని విరక్త మఠం పీఠాధిపతి శాంతలింగ మహాస్వామి, కల్లు మఠం పీఠాధిపతి గురు శిద్ద దేవరు మా ట్లాడుతూ కన్నడ భాష సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అంతరించిపోకుండా రానున్న తరాలకు కూడా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకు సమష్టి కృషి జరగాలని సూచించారు. కన్నడిగుల కోసం నిర్వాహకులు కవి గోష్ఠి, కవిత గోష్ఠిలతోపాటు మహిళలకు కూచిపూడి నృత్యాలు, రంగవల్లులే, విద్యార్థులకు చిత్ర లేఖనం, క్విజ్ పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు పీఠాధిపతులు బహుమతులు అందజేశారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభను కనబరిచిన నామ బసవరాజ, భీమన్న, గురు శిద్దప్పలను గురువులు సన్మానించారు. కార్యక్రమాలు కర్ణాటక విద్యా వర్ధక సంఘం (ధ్వార్వాడ) ప్రధాన కార్యదర్శి శంకర్ హలగట్టి, ఆదోని కన్నడ సంఘం పెద్దలు శరణ బసప్ప, సుగురప్ప, ప్రతాప్, మరుల రాజ్య, విద్దన గౌడ్, గురుబసవ, ఆధ్వర్యంలో జరిగాయి.

రేపటి నుంచి అసెస్‌మెంట్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 25: 2024-25 విద్యాసంవత్సరానికి గాను సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 షెడ్యూలు విడుదలైందని ఈ పరీక్షలు ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఆదివారం తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రశ్నాపత్రాలు అన్ని ప్రభుత్వ యజమాన్య పాఠశాలలకు మాత్రమే డీసీఈబీ సరఫరా అవుతాయని తెలిపారు. ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు ఈ పరీక్షలకు సంబంధించిన ఈ ప్రశ్నాపత్రాలు అన్ని మండల ఎంఆర్‌సీలకు పంపినట్లు తెలిపారు. త్రీమెన్ కమిటీ ప్రశ్నాపత్రాలు ఎంఆర్‌సీలో భద్రపరిచి షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు పరీక్షకు గంట ముందు ఉదయం 9.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రశ్నాపత్రాలు సంబంధిత పాఠశాలలకు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు ఓఎంఆర్‌లు ఒకరోజు ముందు అందిస్తా మన్నారు. ప్రశ్నా పత్రాలు సరఫరా చేసే సిబ్బంది గోప్యతను తప్పక పాటించాలన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న న్యాయాధికారులు



స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

బేతంచెర్ల, ఆగస్టు 25: ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని మద్దిలేటి నరసింహస్వామి మహాలక్ష్మి అమ్మవార్లను ఆదివారం జిల్లా న్యాయాధికారి కబర్ధి, డోన్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మద్దిలేటి నరసింహ స్వామికి, మహాలక్ష్మి అమ్మవార్లకు వారు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో రామాంజనేయులు వారిని శాలువలతో సన్మానించి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

నూతన కోర్టు భవన నిర్మాణ పనులను
పరిశీలించిన జిల్లా న్యాయాధికారి

డోన్(రూరల్): డోన్‌లో నూతన కోర్టు భవన నిర్మాణ పనులను కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్ధి ఆదివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్, డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో రూ.18.79 లక్షలు టోకరా

మంత్రాలయం, ఆగస్టు 25: పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.18.79 లక్షలు తన ఖాతాలో వేయించుకొని ఓ వ్యక్తి దగా చేశాడు. ఈ నెల 23న మంత్రాలయంలో పెళ్లి జరగాల్సి ఉండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది. బళ్లారి జిల్లా దావణగెరి పట్టణానికి చెందిన బసవరెడ్డి కొడుకు జనార్దన్ రెడ్డికి గతంలో ఒక మహిళతో వివాహమైంది. వారు విడాకులు తీసుకున్నారు. మొదటి పెళ్లి అయినట్లు చెప్పకుండా కోడుమూరు చెందిన విష్ణుప్రియ (32) అనే యువతితో ప్రేమ వ్యవహారం నడిపాడు. తను పలు కంపెనీలకు సీఈవోనని, దుబాయ్, లండన్, బెంగుళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో తనకు కంపెనీలు ఉన్నాయని ఆరు నెలలుగా యువతిని నమ్మించాడు. పెళ్లి చేసుకునేందుకు రూ.18.79 లక్షలు తన ఖాతాలో వేయించుకున్నాడు. ఈ నెల 23న మంత్రాలయం భూరమణ కళ్యాణ మండపంలో వివాహం జరగాల్సి ఉండగా.. పెళ్లి కూతురు తరపున బంధువులకు మొదటి పెళ్లి అయిందని తెలియడంతో వివాహం రద్దయింది. దీంతో పెళ్లికూతురు బంధువులు మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంత్రాలయం ఎస్ఐ పరమేశ్వర్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలందరూ లక్షాధికారులు కావాలి



మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ, జేసీ నవ్య, ఎమ్మెల్యే

- కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు
- మహిళలకు ఆర్థిక చేయూత ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం
- జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 25: ప్రభుత్వం అందజేస్తున్న లఖ్ పత్ దీదీ కార్యక్రమం ద్వారా మహిళలు కృషి చేసి లక్షాధికారులు కావాలని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మహారాష్ట్రలోని జల్గావ్‌లో ఏర్పాటు చేసిన లఖ్ పత్ దీదీ సమ్మేళనలో భాగంగా ప్రైమ్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీఎస్) మహిళలను సత్కరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలెక్టరేట్ ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ బి. నవ్య, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి తదితరులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ పొదుపు సంఘాలలోని మహిళలందరూ ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక లబ్ధిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పొదుపు సంఘాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొంది సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ సకాలంలో పొందిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. జాయింట్ కలెక్టర్ బి. నవ్య మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా మహిళలు వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయంగా వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ బ్యాంకులు అందజేస్తున్న ఆర్థిక సహాయం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక విజయం సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం జిల్లాలోని 826 మంది స్వయం సహాయక సంఘాల లఖ్ పత్ దీదీలకు బ్యాంకుల ద్వారా రూ.57.60 కోట్లుమెగా చెక్కును కర్నూలు ఎంపీ, జేసీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎల్డీఎం రామచంద్రరావు, పొదుపు సంఘాల మహిళలు, సీఆర్పీలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

'తెలుగు సాహిత్యానికి కాఫ్కా.. కాశీభట్ల వేణుగోపాల్'

కవులు, రచయితలు, కళాకారుల నివాళి



మాట్లాడుతున్న సాహితీ విమర్శకుడు పి. చంద్రశేఖర్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 25: తన రచనలతో 20వ శతాబ్దాన్ని అత్యంత ప్రభావితం చేసిన జర్మన్ రచయిత 'ఫ్రాంజ్ కాఫ్కా'లానే తెలుగు సాహిత్యంలో దివంగత కవి, రచయిత కాశీభట్ల వేణుగోపాల్ నిలిచిపోతారని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం నగరంలో మద్దూర్‌నగర్‌లోని పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో, కర్నూలు సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన కాశీభట్ల వేణుగోపాల్ సంతాప సభ జరిగింది. ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ఆహ్వానం పలుకగా, ప్రముఖ కవి జి. వెంకటకృష్ణ సభాధ్యక్షత వహించారు. వక్తగా హాజరైన రచయిత, ప్రముఖ విమర్శకుడు పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కాశీభట్ల వేణుగోపాల్ కుటుంబానికి, మతానికి, రాజ్యానికి ఎప్పుడూ బద్ధుడు కాలేదని, ఆయన సంప్రదాయ భ్రష్టత్వంలో జీవించిన ఆధునిక కవి అని కొనియాడారు. విలక్షణమైన రచయితగా, సమాజం పట్ల ముభావంగా ఉంటూ రచనలు చేశారని అన్నారు. ఆయన నిరంతరం నేనూ, నాది అనే కోణం నుంచి రచనలు చేశారని అన్నారు. విశ్రాంత ఎస్పీ రామ ఉమామహేశ్వర శర్మ మాట్లాడుతూ కాశీభట్ల సాహిత్య జీవితం, అతని జీవితం వేరు కావని, రెండూ ఒకటిగా సాగిందని అన్నారు. కవిగా, కథకునిగా, నవలాకారునిగా తెలుగు సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించి, విశేషమైన అభిమానులను సంపాదించుకున్నారని గుర్తు చేశారు. సంగీత విద్వాంసుడు ఎం. దయానంద్ మాట్లాడుతూ కాశీభట్ల సంగీత పరిజ్ఞానం ఉన్నవారని, వేణుగోపాల పదాలతో స్వరాన్ని సృష్టించారని అన్నారు. సభలో మధురకవి ఎలమర్తి రమణయ్య, కథా రచయిత్రి డాక్టర్ సుభాషిణి ఆయన సాహిత్య విలక్షణమైన జీవితాన్ని వివరించారు. అంతకు ముందు కాశీభట్ల వేణుగోపాల్ చిత్రపటానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఉమానాథరావు, శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సభలో ఆద్య మెడికల్స్ అధినేత అవిజ వెంకటేశ్వరరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, విరసం రాష్ట్ర నాయకుడు పాణి, నాగేశ్వరాచారి, మారుతి పౌరోహితం, డాక్టర్ ఎం. హరికిషన్, చౌశా, సయ్యద్ జహీర్ అహ్మద్, డాక్టర్ పేరం ఇందిరాదేవి, లక్ష్మీ కందిమళ్ల, స్వర్ణలత, సీఐ శ్రీనాథ్‌రెడ్డి, టి. వెంకటేశ్, ఇనాయతుల్లా, ఎస్‌డీవీ అజీజ్, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



మంత్రాలయం మఠం ప్రాగంణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 25: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం సోమవారం కృష్ణాష్టమి కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

350 మంది కళాకారుల నృత్యం



మధ్వమార్గ్ కారిడార్‌లో నృత్యం చేస్తున్న కళాకారులు

మంత్రాలయం, ఆగస్టు 25: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో కర్ణాటకలోని ఆసన్ చిన్నరాయపట్నం నేషనల్ క్లాసిక్ డ్యాన్స్ అకాడమీ, ప్రధాన కార్యదర్శి డా. స్వాతి, పి. భరద్వాజ్, శ్రీరాఘవేంద్ర స్వామి మఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మధ్వమార్గ్ కారిడార్‌లో నృత్యప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచే గాక జపాన్, జర్మనీ, ఇండోనేషియా దేశాల నుంచి 350 మంది నృత్య కళాకారులు 15 నిమిషాల పాటు నృత్యం చేసి అంతర్జాతీయ రికార్డు స్థాపించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కళాకారులకు మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, డీఎం ఆనందరావు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

బేతంచెర్ల, ఆగస్టు 25: మండలంలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన రెడ్డిపోగుల నాని (16) అనే యువకుడు తన స్నేహితులతో ఈతకు వెళ్లి ఆదివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నానితో పాటు నాగమణి, మధుసాయి అనే యువకులు గ్రామసమీపంలో ఉన్న బలపం గని వద్దకు ఈతకు వెళ్లారు. గనిలో ఉన్న నీళ్లలో నానిపై నుంచి దూకి గనిలో ఇరుక్కుపోయాడు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి గని నీళ్లలో ఇరుకుని మృతి చెందిన నానిని బయటకు తీశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంబశివనగర్‌లో చోరీ

కర్నూలు, ఆగస్టు 25: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సాంబశివనగర్‌లో చోరీ జరిగింది. ఆర్మీలో పని చేసే రమేష్ అనే వ్యక్తి ఇంట్లో మూడున్నర తులాల బంగారు నగలుతో పాటు కొంత వెండి, నగదు చోరీ చేశారు. రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 20వ తేదీన ఎ. క్యాంపులో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంటికి వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న బంగారు నగలు మాయమైనట్లు గుర్తించాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మాత్రం మూడు రోజులు ఆలస్యంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం విశేషం.

శ్రీశైలానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

శ్రీశైలం, ఆగస్టు 25: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 39,000 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 6,759 క్యూసెక్కులు కలిపి మొత్తం 45,759 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 45,759 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 883.90 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 209.5948 టీఎంసీలుగా నమోదైంది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

మిలటరీ స్కూళ్లలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయ స్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచారకేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

ఎల్లెల్సీలో మహిళ మృతదేహం

హొళగుంద, ఆగస్టు 25: తుంగభద్ర ఎల్లెల్సీ దిగువ కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహన్ని కనుగొన్నట్లు ఎస్సై బాల నరసింహులు తెలిపారు. ఆదివారం సాయంత్రం కడ్లేమాగి క్యాంపు వద్ద ప్రవహిస్తున్న కాలువలో ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మృతురాలి ఒంటిపై నలుపు రంగు చీర, ఆకు పచ్చని జాకెట్ ఉన్నట్లు తెలిపారు. వయస్సు 50 సంవత్సరాలకు పైగా ఉంటుందని అన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్వింటా వేరుశనగ రూ.7,270

ఎమ్మిగనూరు, ఆగస్టు 25: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ క్వింటం గరిష్ఠ ధర రూ. 7,270 పలికింది. మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి రైతు లు వేరుశనగ 2182 క్వింటా ళ్లు, ఆముదాలు 13 క్వింటా ళ్లు, పూలవిత్తనాలు 3 విత్తనా లు అమ్మకానికి వచ్చాయి. వేరుశనగ క్వింటం గరిష్ఠ ధర రూ. 7,270, కనిష్ఠ ధర రూ. 2070, ఆముదాలు గరి ష్ఠ ధర రూ. 5752, కనిష్ఠ ధర రూ. 5530, పూల విత్తనాలు గరిష్ఠ ధర రూ. 3620, కనిష్ఠ ధర రూ. 3620 పలికాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శేషాద్రి రెడ్డి (ఫైల్)

చిప్పగిరి, ఆగస్టు 25 : చిప్పగిరి మండలం నగరడోన గ్రామానికి చెందిన శేషాద్రి రెడ్డి (55) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఈ నెల 18న రాత్రి ఆలూరు నుంచి ద్విచక్ర వాహనంపై విజయ్‌కుమార్ రెడ్డి, శేషాద్రి రెడ్డి వస్తుండగా కుక్కను తప్పించే ప్రయత్నంలో నగరడోన కరెంట్ ఆఫీస్ వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. వెనుక కూర్చున్న శేషాద్రి రెడ్డికి బలమైన గాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు శేషాద్రి రెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ బాబు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరుపాక్షి శేషాద్రి రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం

కోడుమూరు, ఆగస్టు 25: పట్టణంలోని విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. పట్టణంలోని కొత్తపేట ప్రాంతంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని శనివారం రాత్రి 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆ ప్రాంతంలోని రెండు స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు షాపులపై పడ్డాయి. ఆ సమయంలో ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్తంభాలు విరిగిపడటంతో రాత్రంతా కొత్తపేట, కొండపేట కాలనీలకు కరెంటు నిలిచిపోయింది. ఆదివారం ఉదయం విద్యుత్ అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి కరెంటు సరఫరా చేశారు.

ఆదమరిస్తే అంతే గతి

- శిథిలావస్థకు చేరుకున్న వంతెన
- నిత్యం ప్రమాదాలు.



రక్షణ గోడలేని వంతెన

కొలిమిగుండ్ల, ఆగస్టు 25: మండలంలోని నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా అంతే సంగతులు. అనంతపురం, తాడిపత్రి, గుత్తి, బళ్లారి ప్రాంతా ల నుండి కడప, నెల్లూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు ప్రతి రోజూ వేల సంఖ్యలో ఈ రహదారి గుండా వెళుతుంటాయి. అయితే కొలిమిగుండ్ల సమీపంలోని ఢాఖా నాయిని బ్రిడ్జి, కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగుపై ఉన్న వంతెన ప్రమాద కరంగా మారాయి. ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో ఇరుకుగా మారాయి. రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రక్షణ గోడలు లేక అతి వేగంగా వెళ్లే వాహనాలు బోల్తా పడుతున్నాయి. వందల సంఖ్యలో ప్రయా ణికులు క్షతగాత్రులవుతున్నారు. ఈ వంతెనల మీద జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రతి వారంలో ఒకటి లేదా రెండు వాహనాలు తప్పనిసరిగా ఈ వంతెనల వద్ద ప్రమాదానికి గురి అవుతున్నాయంటే పరిస్థితి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. బ్రిడ్జిలకు మరమ్మతు నిర్వహించి ప్రమాదాలను అరికట్టాలని ఈ గ్రామాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

లోడింగ్ కార్మికుడి ఆత్మహత్య

బేతంచెర్ల, ఆగస్టు 25: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి (42) అనే లోడింగ్ కార్మికుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. మూడేళ్ల క్రితం సంజామల మండలం గిద్దలూరు గ్రామం నుంచి ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి జీవనోపాధి కోసం బోయ మద్దిలేటి వచ్చాడు. రంగాపురం గ్రామంలో లోడింగ్ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబ పోషణ చేసుకునేవాడు. గత కొంత కాలంగా తాగుడుకు బానిసై భార్య లక్ష్మీదేవిని తరచూ వేధిస్తున్నాడు. దీంతో ఆమె శనివారం రాత్రి తన చెల్లెలు ఇంటికి వెళ్లింది. మద్దిలేటి తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

కృష్ణాష్టమి వేడుకల్లో గౌరు దంపతులు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు దంపతులు

కల్లూరు, ఆగస్టు 25: కృష్ణాష్టమిని పురస్కరించుకుని నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని శ్రీకృష్ణుని ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించుకున్న గౌరు దంపతులు, వారి తనయుడు గౌరు జనార్దన్ రెడ్డిలకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గౌరు దంపతులకు సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల అధినేత తిమ్మయ్య యాదవ్, హరికృష్ణ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధానా కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, శైలజా, రమేష్ , నారాయణ పాల్గొన్నారు.

అవయవ దాతలను ప్రోత్సహించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 25: అవయవ దాతలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని 48వ వార్డులోని 124వ సచివాలయంలో సంకల్ బాగ్‌లో వలంటీర్ మీసాల సుమలత ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించే అవయవాలతో ఎనిమిది మందికి సమకూర్చే అవకాశం ఉంటుందని, అలాంటి అవయవ దాత అంత్యక్రియలు ప్రభుత్వమే నిర్వహించాలన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ రద్దు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 25: నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ పీవీ రామ లింగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమిని పుర స్కరించుకుని ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నా రు. ప్రజలకు సమస్యలు ఏవైనా ఉంటే మంగళవారం నుంచి పని వేళల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ విభాగం హెల్ప్‌లైన్ నెంబరు 7422992299కు ఫోన్ చేయవచ్చన్నారు. తదుపరి సోమవారం నుంచి ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ నగర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారి వివరాలు లభ్యం

కర్నూలు, ఆగస్టు 25: కర్నూలు రైల్వేస్టేషన్‌లో యాచకురాలి వద్ద దొరికిన చిన్నారి వివరాలను పోలీసులు గుర్తించారు. రెండు రోజుల క్రితం ఓ యాచకురాలి దగ్గర చిన్నారిని పోలీసులు గుర్తించారు. ఆ చిన్నారి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లోకేశ్ అనే వ్యక్తి కూతురుగా గుర్తించారు. లోకేశ్ భార్య కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. ఈయన గత కొద్ది కాలంగా మతిస్థితిమితం లేకుండా తిరుగుతున్నాడు. అయితే లోకేశ్ సోదరులును పోలీసులు పిలిపించారు. చిన్నారి ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో ఉంది. మంగళవారం ఆ చిన్నారిని తిరిగి వీరికి అప్పగించే అవకాశం ఉంది.

29న భాషా దినోత్సవం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 25: ఆధునిక తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29న ఉదయం 10 గంటలకు టీజీవీ కళాక్షేత్రానికి హాజరై, తమ పేర్లు నమోదు చేసుకొని ఈ పోటీల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

'హిందూ ధర్మమే ప్రపంచానికి మార్గదర్శకం'

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 25: హిందూ ధర్మమే ప్రపంచానికి మార్గదర్శకం చేస్తోందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో వీహెచ్‌పీ ఆవిర్భవించి అరవై ఏళ్లు అవుతున్న సందర్భంగా, నగరంలో వివిధ ప్రాంతాల్లో హిందూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. పాతనగరంలోని శ్రీరామాలయంలో, పూలబజార్‌లోని పెద్ద అమ్మవారిశాలలో, సాయిబాబా కల్యాణ మండపాల్లో ఈ సమ్మేళనాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర సహ కార్యదర్శి ఎస్ ప్రాణేశ్, రాష్ట్ర సహ కోశాధికారి గూడా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'రుణాలను సద్వినియోగం చేసుకోండి'


ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న పొదుపు మహిళలు

ఓర్వకల్లు, ఆగస్టు 25: పొదుపు మహిళలు ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు డీఎం రవిశంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులోని పొదుపు భవనంలో పతి దీదీ లబ్ధిదారులు, లక్‌పతి దీదీ సీఆర్‌పీ (యాని మేటర్లకు) పొదుపు మహిళలు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈసందర్భంగా రవిశంకర్ రెడ్డి మాట్లా డుతూ పేదరిక నిర్మూలన, జీవనోపాదుల ఏర్పాటు, సామాజిక ఎదుగుదల, సంపూర్ణ అక్షరాస్యత, ఆరోగ్యం పౌష్టికాహారంపై పొదుపు మహిళలకు వివరించారు. అనంతరం సీఆర్‌పీలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పొదుపులక్ష్మి మండల సమైఖ్య అధ్యక్షురాలు రత్నమ్మ, ఏపీఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు సరస్వతమ్మ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సి.బెళగల్, ఆగస్టు 25: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఎస్‌ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తనిఖీలో భాగంగా రూ.2,545 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

వామ్మో కుక్కలు..

» దాడులతో భయపడుతున్న చిన్నారులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 25: నగరంలోని పలు కాలనీల్లో కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ప్రతి రోజూ కుక్కలను నిరోధించి కాపాడాలని ఫోన్లు వస్తున్నాయి. నాగేంద్ర నగర్‌లో కుక్కల సమూహం ఎక్కువగా ఉందని, కాపాడాలని స్థానికుడు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో పాటు వివిధ కాలనీల నుంచి కూడ కూడా కుక్కల సమూహంతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ సంవత్సరం జనవరిలో పెద్దపాడు గ్రామంలో కుక్క కొరకడంతో గాయాలయ్యాయని ఓ వ్యక్తి ఏకంగా స్పందనలో కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం కొసమెరుపు. ప్రతి రోజూ ఒక్కరైనా కమాండ్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసి కుక్కల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పలు కాలనీల్లో కుక్కలు అధిక సంఖ్యలో స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి కుక్కలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● కౌన్సిల్‌లో కుక్కల నియంత్రణపై రగడ..

గత నెల 15న జరిగిన కౌన్సిల్ సమావేశంలో కుక్కడ నియంత్రణపై కార్పొరేటర్లు అధికారులు అసహనం వ్యక్తం చేశారు. నగరంలో కుక్కలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం చెందారని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కలను పట్టుకోకున్నా పట్టుకున్నట్లు, ఆపరేషన్ చేయకుండా చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారని 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహ్మద్ తెలిపారు. ఆపరేషన్ చేసిన వాటికి ఆపరేషన్ ఫెయిల్ కావడంతో తిరిగి పిల్లలకు జన్మనిస్తున్నట్లు ఆయన తెలిపారు. వార్డులలో కార్పొరేటర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కుక్కలను తీసుకెళ్తున్నారని, కనీసం సమాచారం అందిస్తే తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని కార్పొరేటర్లు తెలిపారు.

● రెండు నెలల్లో 650 కుక్కలకు ఆపరేషన్లు..

జూన్, జూలై నెలల్లో సుమారు 650 కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేశారు. కుక్కలను పట్టుకుని వాటికి ఆపరేషన్ చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన నవోదయ వెట్ సొసైటీకి అప్పగించారు. ఒక్కో కుక్కకు రూ.1500 చెల్లిస్తున్నారు. ఈ లెక్కన రెండు నెలల్లో రూ.9,75,000 ఖర్చు చేశారు.


నగర ప్రధాన కూడలిలో సంచరిస్తున్న కుక్కలు

అయినా నగరంలో సమూహాలుగా కుక్కలు కనపడుతూనే ఉన్నాయి.

● కమాండ్ కంట్రోల్ రూమ్‌కు..

నగరంలోని వివిధ వార్డుల నుంచి కమాండ్ కంట్రోల్‌కు కుక్కలను తీసుకెళ్లాలని ఫిర్యాదులు అందాయి. నాగేంద్రనగర్, ధనలక్ష్మినగర్, పాతబస్టాండు, మక్కామసీదు, కొత్తపేట, నరసింహారెడ్డినగర్, సంతోష్‌నగర్, నందికొట్కూరు రోడ్డు జయజింహ టవర్స్, గౌలిగేరి, రోజా వీధి, బాలాజీనగర్, బొంగుల బజారు, టౌన్‌మోడల్ పాఠశాల, పెద్దమార్కెట్, నాలుగో తరగతి కాలనీ, క్రిష్ణానగర్, పెద్దపాడు, తదితర ప్రాంతాల నుంచి కుక్కల బెడద నిరోధించాలని ఫోన్లు వచ్చాయి.

పట్టుకెళ్లి ఆపరేషన్ చేస్తున్నాం

నగరంలో కుక్కలను పట్టుకెళ్తున్నాం. ఫిర్యాదు వచ్చిన ప్రతి చోట స్పందించి కుక్కలను తీసుకెళ్తున్నారు. పట్టుకెళ్లిన కుక్కలను కేవలం ఆపరేషన్ చేసి వదలాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఉంది. ఆపరేషన్ చేయడం వల్ల కుక్కల్లో ఉండే శక్తి సన్నగిల్లుతుంది. వాటిని చంపే అధికారం లేదు. అందుకే వాటిని పట్టుకెళ్లి ఆపరేషన్ చేసి వదిలేయాలని కోర్టు నుంచి ఆదేశాలు ఉన్నాయి. విడతల వారిగా అన్ని వార్డుల్లో పూర్తి చేస్తాం.

- డా.మల్లన్న, పశువైద్యాధికారి, నగర పాలక సంస్థ, కర్నూలు

నిరుద్యోగ సమస్యపై మంత్రి వర్గంలో చర్చించాలి

మంత్రి టీజీకి ఏఐవైఎఫ్ వినతి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 25: నిరుద్యోగ సమస్యపై ఈనెల 28న జరిగే మంత్రి వర్గ సమావేశంలో చర్చించాలని ఏఐవైఎఫ్ నాయ కులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని మంత్రి టీజీ భరత్ ను అఖిల భారత్ యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు, బాబయ్య, బీసన్నలతో నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. గత ప్రభుత్వం గ్రామ సచివాలయం, వార్డు వలంటరీ పోస్టులు తప్ప ఎలాంటి ప్రభుత్వ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని, ఎన్నికల ముందు కానిస్టేబుల్, డీఎస్సీ అరకొర పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి అది కూడా భర్తీ చేయకుండా చేతులు ఎత్తేసిందని మండిపడ్డారు. స్పందించిన మంత్రి నిరుద్యోగుల సమస్యలపై మంత్రి వర్గంలో చర్చిస్తామని, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు.

బీడి కార్మికుల సమస్యలు పరిష్కరించండి: బీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ అబ్దుల్ సుభాన్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ బీడి కార్మికులకు ఒరిజనల్ ఇండ్ల పట్టాలు ఇచ్చి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ఎండీ షరీఫ్, అల్లా బకాష్, బషీర్ బాషా, సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.


మంత్రి టీజీకి వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాష్ట్ర విజేతలుగా లక్ష్మాపురం, సి.బెళగల్ జట్లు

ముగిసిన అంతర్ పాఠశాలల రగ్బీ పోటీలు


విజేతలతో అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 25: స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ముగిసిన అంతర్ పాఠశాలల పోటీల్లో బాలికల విభాగంలో లక్ష్మాపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జట్టు, బాలుర విభాగంలో సి. బెళగల్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో లక్ష్మాపురం ఏపీఎస్ డబ్ల్యూఆర్ కంబలపాడు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ దిన్నెదేవరపాడు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే బాలుర విభాగంలో సి. బెళగల్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కర్నూలు ఆదర్శ విద్యామందిర్ బీ.క్యాంపు, ఎస్టీ ఆశ్రమ పాఠశాల జట్లు వరుసగా విన్నర్, రన్నర్, థర్డ్ స్థానాలను కైవసం చేసుకున్నాయి.

నాటుసారా బెల్లం స్వాధీనం

ఓర్వకల్లు, ఆగస్టు 25: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై పూడిచెర్ల మెట్ట వద్ద ఓర్వకల్లు ఎస్ఐ సునీల్ కుమార్, పోలీసు సిబ్బంది ఆదివారం అక్రమంగా తరలిస్తున్న నాటుసారా బెల్లాన్ని టాటా గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ముగ్గురు వ్యక్తులు టాటా గూడ్స్ వాహనంలో 2,2240 కేజీల నాటుసారా బెల్లం బాక్స్‌లను, ప్లాస్టిక్ సంచిలో 5 కేజీల నవసాగరం గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు నుంచి మండలంలోని గుడుంబాయి తండాకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటో డ్రైవర్ దిల్‌షాద్‌ఖాన్, నేనావత్ వెంకటేశ్ నాయక్ పట్టుబడగా.. మూడో వ్యక్తి నేనావత్ ప్రసాద్ నాయక్ పరారైనట్లు పోలీసులు తెలిపారు. నాటుసారా, నవసాగరం, వాహనాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గూడూరు ఎస్ఐగా తిమ్మయ్య



గూడూరు, ఆగస్టు 25: గూడూరు నూతన ఎస్ఐగా పి. తిమ్మయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 25: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల సుధాకర్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కార్యవ ర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.గోవిందు నాయక్, అధ్యక్షుడిగా ఎ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఎస్.నరేష్, ప్రధాన కార్యదర్శిగా కే.లక్ష్మానాయక్, జాయింట్ సెక్రటరీ గా రవి కుమార్, కోశాధికారిగా కే.దుర్గాప్రసద్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపేంద్ర, ప్రధాన కార్యదర్శి కుమార్, జాయింట్ సెక్రటరీ మాత్ర నాయక్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఆర్చరీ, రగ్బీ పోటీలు ప్రారంభం

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 25: డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అంతర్ పాఠశాలల ఆర్చరీ, రగ్బీ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు కలిసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రగ్బీ కార్యదర్శి రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 25: సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కేంద్ర కో కన్వీనర్ రంగస్వామి కోరారు. ఆదివారం ఇందిరా గాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో షుగరు, బీపీ, పక్షవాతం, మూర్ఛ తదితర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ భరత్, నాగభూషణరావు, హనీఫ్, తేజ, కేంద్రం కన్వీనర్ జే.శేషయ్య పాల్గొన్నారు.

కృష్ణాష్టమికి ఆలయాలు ముస్తాబు


ముస్తాబైన శ్రీకృష్ణుడి ఆలయం

సి.బెళగల్, ఆగస్టు 25: కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని పోలకల్లు, బురాన్‌దొడ్డి, మారందొడ్డి, గుండ్రేవుల, ఇనగండ్ల, కొండాపురం, సంగాల గ్రామాల్లోని ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జన్మదినం సందర్భంగా స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 25: ఏపీ రైతు సంఘం అధ్వ ర్యంలో సెప్టెంబరు 1న నిర్వహించే రైతాంగా డిమాండ్స్ డేను జయ ప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడు పిలుపునిచ్చారు. ఆదివారం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన గిట్టు బాటు ధరలు, పంట రుణాలు, బీమా, పంటలకు కావాల్సిన సాగు నీరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించడం లేదన్నారు. ఈ సమావేశం లో సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, సురేంద్రయాదవ్, కృష్ణనాయక్, మల్లికార్జున పాల్గొన్నారు.

3న జిల్లా యోగాసన జట్ల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 25: నగరంలోని డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో సెప్టెంబరు 3న జిల్లా స్థాయి యోగాసన జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీ శివరాజు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఈ.ప్రభాకర్‌లు ఆదివారం తెలిపారు. పోటీలు 14, 18, 28, 35, 45, 55 సంవత్సరాల వయస్సులోపు విభాగాల్లో బాలబాలికలు, పురుషులకు మహిళలకు వేర్వేరుగా ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9949257657 నెం బరును సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్, ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 25: షెడ్యూల్ కులాల వారికి షెడ్యూల్ తెగల సర్టిఫికెట్ జారీ చేసిన కౌతాళం తహసీల్దార్, ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మాని టరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు కలెక్టర్‌ను కోరారు. ఆదివారం ఏపీ వైహెచ్ పీఎస్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ షెడ్యూలు కులానికి చెందిన నల్లగొడి శ్రీనివాసులకు ఎస్టీ కమ్యూనిటీలో ఎరుకుల కుల ధ్రువీకరణ పత్రాన్ని కౌతాళం మండలం తహసీల్దార్ జారీ చేశారు. ఆదోనిలో సదాపురం ఆది ఆంధ్ర పురపాలక ప్రాథమిక పాఠశాల ప్రభుత్వ ఉపా ధ్యాయుడైన నల్లగోడి శ్రీనివాసులును నకిలీ కుల ధ్రువీకరణ పత్రం విషయంలో అధికారులు సస్పెండ్ చేశారు. విచారణలో భాగంగా ఆయనను కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అందులో భాగంగా షెడ్యూల్ కులాలకు చెందిన ఆయనకు షెడ్యూల్ తెగల సర్టిఫికెట్‌ను జారీ చేశారు. దీనికి బాధ్యులైన కౌతాళం ఎమ్మార్వో, ఆర్ఐలను సస్పెండ్ చేయాలన్నారు.

పగిలిన ఎత్తిపోతల పథకం పైపు లైను

సి.బెళగల్, ఆగస్టు 25: ఎత్తిపోతల పథకం పైపులైను పగలడంతో ఎకరా ఉల్లిపంట నష్ట పోయినట్లు గుండ్రేవుల గ్రామానికి చెందిన రైతు గోవిందు తెలిపాడు. మండలంలోని క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పైపులైను గుండ్రేవుల గ్రామానికి సమీపంలో ఉల్లిపంట పంటలో పైపులైను రెండు చోట్ల పగలడంతో ఉల్లిపంట పూర్తిగా కొట్టుకుపోయిందని రైతు గోవిందు తెలిపారు. పోలకల్లు గ్రామ రైతులు ఉల్లి పంట నష్టపోయిన రైతు గోవిందుకు రూ. 70 వేలు సాయం చేశారు.


పగిలిపోయిన పైపు లైను

యువగళం పాదయాత్ర యువతకు స్ఫూర్తి

పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి టీజీ భరత్


యువగళం పాదయాత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఆగస్టు 25: నారా లోకేశ్ యువగళం పాదయాత్ర యువతకు స్ఫూర్తిగా నిలిచిందని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మంత్రి టీజీ భరత్ చాంబర్లో చిత్తూరు జిల్లాలో లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఆంధ్రనాడు సంపాదకుడు హరిబాబు లోకేష్ పాదయాత్రలోని ప్రతిఅంశాన్ని కళ్లకు కట్టినట్టుగా అభివర్ణించారని కొనియాడారు.

రాయపాటి శ్రీనివాస్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 25: లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ క్యాబినేట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అవార్డుతోపాటు, జిల్లా గవర్నర్ అప్రిషియేషన్ అవార్డులను అందజేశారు. ఆదివారం నెల్లూరు జిల్లా కేంద్రంలో జరిగిన లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో 2023-24 సంవత్సరానికి గాను ఈ సేవా అవార్డులను డాక్టర్ రాయపాటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్లు గౌతమి, ప్రసాద్, ఈశ్వరకుమార్, కాకర్ల వేణుబాబు, మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్ పర్సన్ దామర్ల శ్రీకాంతి పాల్గొన్నారు.

ఎన్.వెంకటరామరాజుకు లయన్స్ ఉత్తమ అవార్డు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 25: లయన్స్ ఇంటర్నేషనల్ ఉత్తమ అవార్డును ఎన్.వెంకటరామరాజు అందుకున్నారు. ఆదివారం నెల్లూరులో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డు ఉత్సవంలో గవర్నర్ వై.నాగేశ్వర రావు, మాజీ గవర్నర్ దుర్గా నాగేశ్వరరావు చే తుల మీదుగా రామరాజు అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషన్ సేవా కార్యక్ర మంలో భాగంగా వివిధ సేవలు చేసిన రామరాజుకు అవార్డును ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు వెంక టేశ్వర్లు, రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి


బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 25: బీసీ భవన్‌లో ఆదివారం బీపీ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీపీ మండల్ చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయాచారి, బీసీ జేఏసీ కన్వీనర్లు బత్తుల లక్ష్మీకాంతయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ కన్వీనర్లు అయ్యన్న యాదవ్, లక్ష్మయ్య యాదవ్, క్రిష్టోజి రావు, బుగ్గన్న పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 25: విజయవాడలో ఈనెల 28న జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. ఆదివారం సీఆర్ భవన్‌లో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. మునెప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూమి కోల్పోయిన బాధితులకు పట్టాలు ఇవ్వాలనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ, సహా య కార్యదర్శులు ముప్పాల నాగేశ్వరరావు, జేవీ సత్యనా రాయణ మూర్తి హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడు, సి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'దైవ మార్గమే ఆనందకరం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 25: దైవ మార్గమే యువతకు ఆనందకరమైన జీవితాన్ని ఇచ్చి, సమాజంలో వారికి మార్గదర్శకం చేస్తుందని దైవ సందేశకుడు ఎన్. అక్రమన్ సామ్ విన్సీ ఉద్బోధించారు. నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ఆదివారం 59వ యువజన ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరులు రెవ. ఆర్ అనిల్‌కుమార్ సామ్యేల్, రెవ. ఎస్‌జే జీవన్, గౌరవ సంఘ కాపరి రెవ. ఆర్ పాస్కల్ ప్రకాశ్, సీసీవైఎఫ్ డైరెక్టర్ ఆర్‌బీ ఎలిజబెత్ భాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ పి. రోహిత్ షబుయేల్, స్టీఫెన్, అఖిలేష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్


ఓర్వకల్లులో అలంకారప్రాయంగా మినరల్ వాటర్ ప్లాంట్

ఓర్వకల్లు, ఆగస్టు 25: ఓర్వకల్లులో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ రాజకీయ నాయకుల జోక్యంతో నెల రోజులుగా నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామ ప్రజలు తాగు నీటికి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2011లో ఓర్వకల్లు గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందించాలనే లక్ష్యంతో విజార్ సుల్తాన్ తొబాకో కంపెనీ (వీఎస్‌టి) హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆ కంపెనీ గ్రామ ప్రజలకు నిరంతరం తాగునీరు అందించేది. తదనంతరం ఐదేళ్ల తర్వాత వాటర్ ప్లాంట్‌ను గ్రామ పంచాయతీకి అప్పగించగా అప్పటి నుంచి పలువురు వ్యక్తులకు వాటర్ ప్లాంట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయితే గత నెల రోజుల నుంచి వాటర్ ప్లాంట్ మూసివేయడంతో గ్రామ ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వాటర్ ప్లాంట్ నిర్వహణ పంచాయతీ ఆధ్వర్యంలో వేలం పాట లేదా పంచాయతీ ఆధ్వర్యంలో ఓ వ్యక్తిని నియమించి ప్రజలకు తాగు నీరు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మూగ జీవాలకు ప్లాస్టిక్ ఉరి

- ప్లాస్టిక్ వ్యర్థాలు తిని పశువుల మృత్యువాత
- ఆవు కడుపు నుంచి 70 కిలోల వ్యర్థాల తొలగింపు
- ఎమ్మిగనూరులో దుస్థితి



ఆవు కడుపులో నుంచి వ్యర్థాలు తొలగించిన పశువైద్యులు (ఫైల్)



ఎమ్మిగనూరు పట్టణంలో వీధి పశువులు భారీగా సంచరిస్తున్నాయి. యజమానులు వీటి ఆలనాపాలనా చూడకపోవడంతో అవి రహదారుల పక్కన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మృత్యువాత పడుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి, స్థానికంగా గోశాల ఏర్పాటు చేసి వీటిని రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మిగనూరు, ఆగస్టు 25: పట్టణంలోని అన్ని రహదారులపై మూగజీవాలు సంచరిస్తున్నాయి. పశువుల ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ కడుపు నింపుకోవడంతో అది వీటికి ఉరిగా మారుతోంది. చివరకు మృత్యువాత పడుతున్నాయి. వీటి యజమానులు పశువుల ఆలనాపాలన చూడకుండా వదిలివేయడంతో రహదారులపైనే అవి నిద్రిస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు, కాలనీల్లో సైతం ఇవి రహదారులపైనే ఉంటున్నాయి.

ఆహారంగా ప్లాసిక్ వ్యర్థాలు

స్థానిక ప్రజలు, జంతు ప్రేమికులు వీటికి ఆహారాన్ని అందిస్తున్నా అది సరిపోవడం లేదు. అయితే కొన్ని పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలు తింటుండటంతో అవి జీర్ణం కాక అస్వస్థతకు గురై మృత్యువాత పడుతున్నాయి.

ఇటీవల వృద్ధురాలి మృతి

పట్టణంలోని ఇంద్రానగర్‌లో ఓ వృద్ధురాలిపై వీధి పశువు దాడి చేయటంతో ఆమె మృతి చెందింది. ఇలాంటి ఘటనలు అనేకమున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక అధికారులు తూతూమంత్రంగా వ్యవహరిస్తూ సమస్యను పూర్తిగా పరిష్కరించడం లేదని సమాచారం. ఒకటి రెండు సార్లు వీదిపశువులను ఆదోని గోశాలకు తరలించి చేతులు దులుపుకున్నారే తప్ప, ఇక్కడే గోశాల ఏర్పాటు చేయడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గోశాల ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి పశువులను నియంతించాల్సిన బాధ్యత పురపాలక అధికారులదే. అయితే వారు వీటిని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసినా వందలకొద్దీ మూగజీవాలు రోడ్లపై తిరుగుతూ పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రజలపై దాడులు చేస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

70 కేజీల వ్యర్థాల తొలగింపు

పట్టణంలో వీదిల్లో తిరిగే ఓ ఆవు అస్వస్థతకు గురికావటంతో స్థానికులు పశువైద్యశాలకు తరలించారు. పశువైద్యులు సుబ్రహ్మణ్యేశ్వర ఆచారి, నరేంద్రనాథ్ రెడ్డి, వీరేష్, రవితేజ శస్త్రచికిత్స చేసి కడుపులోని 70కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను బయటకు తీశారు.

గోశాలకు వీధి పశువులు : కమిషనర్



ఎమ్మిగనూరు టౌన్: వీధి పశువులను గోశాలకు తరలిస్తామని మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ పశువులు రోడ్లపై ఉంటూ, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయని అన్నారు. యజమా నులు 24 గంటలలోపు తీసికెళ్లకపోతే వాటి ని గోశాలకు తరలిస్తామని తెలిపారు. పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

చంద్రబాబుతోనే రాజధాని అభివృద్ధి



పాదయాత్ర చేస్తున్న ప్రవీణ్

మద్దికెర, ఆగస్టు 25: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి సాధ్యమని టీడీపీ కార్యకర్త ప్రవీణ్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ తిరుపతి అలిపిరి నుంచి అమరావతికి పాదయాత్ర చేస్తూ విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి యాత్ర ప్రారంభించానని ముగిసిన అనంతరం సేకరించిన మొత్తాన్ని రాజధాని నిర్మాణానికి అందజేయనున్నట్లు తెలిపారు.

వైసీపీ దోచుకున్న భూములు రైతులకివ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తుగ్గలి, ఆగస్టు 25: గత వైసీపీ ప్రభుత్వం దోచుకున్న అసైన్డ్ భూములను రైతులకివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కార్యవర్గ సభ్యులు నబీ రసూల్ అన్నారు. ఆదివారం పెండేకల్ ఆర్ఎస్‌లో మండల కార్యదర్శి సుల్తాన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. భూములను బాధితులకు ఇచ్చేవరకు సీపీఐ పోరాడుతుందన్నారు. ఈ నెల 28న బాధితుల సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాగరాజు, గురుదాసు, వెంకటేశ్, ఉమాపతి పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

మద్దికెర, ఆగస్టు 25: పత్తికొండ డీఎస్పీగా బాధ్యలు చేపట్టిన వెంకట్రామయ్యను పెరవలి గ్రామానికి చెందిన దేవాలయ మాజీ చైర్మన్ ఈడగ దస్తగిరిగౌడు ఆదివారం కలిసి సన్మానించారు. శ్రీనివాసులు, వెంకప్ప, తదితరులు ఉన్నారు.

ఈ ఏడాది సమృద్ధిగా పంటలు

దేవనకొండ, ఆగస్టు 25 : ఈ ఏడాది సంవృద్ధిగా పంటలు పండుతాయని నల్లచెలిమల ఆలయ పూజారి ఆకాంక్షించారు. నల్లచెలిమల లక్ష్మీనరసింహ స్వామి గన్నేరు పూలదండలను శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో కొండ చరియపై వదిలారు.

పెద్ద వంకకు రక్షణ గోడ నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఐ కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 25: పట్టణంలోని సీఆర్ నగర్ పెద్ద వంకకు రక్షణ గోడ నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు కోరారు. ఆదివారం మాట్లాడుతూ మురుగునీరు పారే వంకకు రక్షణగోడ లేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి, సుదర్శన్, వీరేష్, విజయ్, ఈరన్న, అనుమప్ప, లింగన్న, సామేల్, వీరప్ప పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 24: పట్టణంలో ఎస్సీ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్ల లేక ఎస్సీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామాల నుంచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తి చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థకు చేరిన హాస్టళ్ల భవనాలను నిర్మించాలని కోరారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కౌతాళం, ఆగస్టు 25: ఉరుకుంద ఈరన్న ఆలయం రాజగోపుర నిర్మాణానికి ఆదివారం ఓ భక్తుడు రూ.లక్ష విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో గురుప్రసాద్ ఆదివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా బురెడ్డిపల్లికి చెందిన శ్రీదేవి, విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,001 నగదును ఆలయ ఉద్యోగి విజయ్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు. దాతలకు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి, స్వామి వారి శేషావస్త్రాలను అందజేశారు.

బదినేహాల్ ఖోఖో జట్టుకు బంగారు పథకం

కౌతాళం, ఆగస్టు 25: మండలంలోని బదినేహాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖో పోటీల్లో బంగారు పథకం సాధించినట్లు పీఈటీ రాజు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో బాలికల పోటీల్లో ఫైనల్‌లో కర్నూలు సెయింట్ జోసెఫ్ పాఠశాల జట్టును ఓడించి విజేతగా నిలిచారని అన్నారు. గ్రామస్థులు పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా మండల్ జయంతి



నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 25 : మాజీ ఎంపీ, సంఘసంస్కర్త మండల్ జయంత్రి ఆదివారం బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయకుడు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బీపీ మండల్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్‌గా ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు మరువలేనివి అన్నారు. దేవిశెట్టి ప్రకాష్, శేషన్న, రాజేవ్వరరావు, శివకుమార్ స్వామి, సోమశేఖర్, మల్లేశ్వరప్ప, మల్లేకర్ శ్రీనివాసులు, నల్లారెడ్డి, శ్రీనివాసులు, ఆనంద్ పాల్గొన్నారు.

మూడో తేదీన జిల్లా యోగాసన జట్ల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 25: నగరంలోని డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో సెప్టెంబరు 3న జిల్లా స్థాయి యోగాసన జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీ శివరాజు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఈ.ప్రభాకర్‌లు ఆదివారం తెలిపారు. పోటీలు 14, 18, 28, 35, 45, 55 సంవత్సరాల వయస్సులోపు విభాగాల్లో బాలబాలికలు, పురుషులకు మహిళలకు వేర్వేరుగా ఉంటాయన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9949257657 నెం బరును సంప్రదించాలని సూచించారు.



తుగ్గలిలో పొదుపు మహిళలకు చెక్కు అందిస్తున్న అధికారులు

లక్ష్యాధికారులను చేయడమే ప్రభుత్వాల లక్ష్యం

తుగ్గలి, ఆగస్టు 25: అక్కా చెల్లెమ్మలను లక్ష్యాధికారులను చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని ఎంపీపీ ఎర్రనాగప్ప, ఏపీఎం రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం తుగ్గలి వెలుగు కార్యాలయంలో ప్రధానమంత్రి లక్‌పత్ దీదీ కార్యక్రమంలో భాగంగా జ్యోతి సమైఖ్య మండలి ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు మెగా చెక్ అందించారు. కూటమి ప్రభుత్వం 78 పొదుపు సంఘాలకుగాను రూ.1.22 కోట్లు, ముద్ర కింద 22 మందికి రూ.22 లక్షల రుణం అందించామని తెలిపారు. పొదుపు మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని, వ్యాపారంతో లక్షాధికారులు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు, పొదుపు మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ రవి, సీసీలు అంజనేయులు, కరీమ్, శేఖర్, తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి..

మద్దికెర: మహిళలు ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్ బండారు సుహాసిని, ఏపీఎం మధుబాబు ఆకాంక్షించారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ పొదుపు మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.5 లక్షల రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. రుణాలు పొందిన మహిళలు సకాలంలో తిరిగి చెల్లించి బాగుపడాలని కోరారు. శ్రీనివాసులు, వెంకప్ప, తదితరులు ఉన్నారు.



మద్దికెరలో చెక్కు అందజేస్తున్న సర్పంచ్ బండారు సుహాసిని



దేవనకొండ లో మాట్లాడుతున్న అధికారులు

పొదుపుతో ఉన్నత స్థితికి..

దేవనకొండ: మహిళలు పొదుపుతో ఉన్నత స్థితికి చేరుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, వెలుగు ఏపీఎం రమేష్ సూచించారు. ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధాని మోదీ లక్‌పత్ దీదీ కార్యక్రమంలో భాగంగా మహిళ సీఆర్పీలను సన్మానించారు. మండలంలోని 77 పొదుపు సంఘాలకు రూ.3.94 కోట్ల రుణాల చెక్‌ను అందజేశారు. కూటమి నాయకులు మల్లికార్జుగౌడ్, రవి, జగదీష్, కప్పట్రాళ్ల మల్లికార్జున, రంగడు, శేఖర్‌గౌడ్, ఉచ్చీరప్ప, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని మానుకోవాలి : సీఐ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ పులిశేఖర్

తుగ్గలి, ఆగస్టు 25: నేరప్రవత్తిని మానుకోవాలని, చట్టాలని గౌరవించాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ హెచ్చరించారు. ఆదివారం జొన్నగిరి పోలీస్‌స్టేషన్‌లో రైడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తెలిసీ తెలియక తప్పులు చేసినా, వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం అమ్మినట్లుపై చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించదవ్దని సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని వాటిని గౌరవిస్తే అందరికీ న్యాయం సమకూరుతుందని సీఐ తెలిపారు.

కృష్ణాష్టమి ప్రశాంతంగా చేసుకోవాలి



ఎస్ఐని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

మద్దికెర, ఆగస్టు 25: గ్రామస్థులు కృష్ణాష్టమిని ప్రశాంతంగా చేసుకోవాలని ఎస్ఐ విజయకుమార్ సూచించారు. ఆదివారం పెరవలి గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మూలింటి రామూ యాదవ్, జిల్లా యాదవ సంఘం నాయకులు మూలింటి రంగస్వామి ఎస్ఐని కలిసి కృష్ణాష్టమికి అనుమతి ఇవ్వాలని కోరారు. గ్రామంలో రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. స్పందించిన ఎస్ఐ అసాంఘిక కార్యాలకు తావు లేకుండా చేసుకోవాలని, సూచించారు. అనంతరం వారు ఎస్ఐని సన్మానించారు. మూలింటి గోపాల్, రామాంజనేయులు ఉన్నారు.

అస్తవ్యస్తం

- ఆలూరులో తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- బస్టాండ్‌ను చుట్టేసిన ఆటోలు, ప్రైవేట్ బస్సులు
- ఇబ్బంది కలిగిస్తున్న వీధి వ్యాపారాలు



బస్టాండ్ వద్ద అడ్డదిడ్డంగా నిలిపిన ఆటోలు



రోడ్డుపైనే వీధి వ్యాపారాలు

ఆలూరు, ఆగస్టు 25: పట్టణంలో టాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పాత బస్టాండ్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటలోను ఇష్టారాజ్యంగా నిలుపుతుం డటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కన వీధి వ్యాపారులు రోడ్డుకు అడ్డంగా వ్యాపారం చేస్తుం డటంతో సమస్య త్రీవగా మారింది. ప్రైవేట్ బస్సులు కూడా అక్కడే నిలిపి ఉంచడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రమాదాలు జరిగే అవకాశం

బస్టాండ్ వద్ద రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తుం డటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. జాతీయ రహదారి కావడం, నిత్యం రద్దీగా ఉండటంతో ఏ వాహనం ఎటు వెళుతుందో తెలియడం లేదు. కర్ణాటక బస్సులు అతివేగంతో వస్తుండటం, లారీలతో రహదరాఇ రద్దీగా ఉంటుంది.

ప్రమాదం సంభవించక ముందే అధికారులు స్పందించి వీధి వ్యాపారులను సంత మార్కెట్‌కు షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

వీధి వ్యాపారాలను సంతల్లోకి తరలించాలని కోరా

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బస్టాండ్ లోపలే బస్సులు నిలపాలి. వీధి అంగళ్లు, వ్యాపారాలతో సమతస్య తలెత్తుతోంది. వీరిని సంత మార్కెట్ తరలించాలని పంచాయతీ అధికారులను కోరాం.

- నరసింహులు, ఎస్ఐ ఆలూరు

తాగునీటి కోసం పడిగాపులు

ఆస్పరి, ఆగస్టు 25: మండలంలోని తొగలుగల్లు గ్రామ ప్రజలు తాగునీటికోసం పడిగాపులు కాస్తున్నారు. వేసవి కాకున్నా తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాకపోయినా ఇబ్బందులు పడుతున్నామని కిలోమీటర్లు బిందెలు తీసుకుని వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. తాగునీటి పథకంలో నీరు అడుగంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



మినీ ట్యాంకు వద్ద బిందెలతో మహిళలు

క్షణ క్షణం.. భయం



శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంక్

ఆదోని, ఆగస్టు 25: మండలంలోని చిన్న హరివాణం గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనన్న గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ట్యాంక్ నుంచే చిన్న హరివాణం, చిన్నగోనెహాల్ గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు కావడంతో పెచ్చులూడుతున్నాయి. స్థానికులు భయం భయంగా తమ పనులను చూసుకుంటున్నారు. ట్యాంకు కూలితే ఈ రెండు గ్రామాలకు నీటి సరఫరా అగమ్యగోచరంగా మారే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి స్పందించి నూతన ఓవర్ హెడ్ ట్యాంకు మంజూరు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.